క్లుప్తంగా

భక్తులకు మజ్జిగ పంపిణీ



పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు వేసవి తీవ్రత దృష్ట్యా.. ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. గుంటూరుకు చెందిన యోగానంద శ్రీనివాసరావు సౌజన్యంతో మజ్జిగ పంపిణీ చేశామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఏఈఓ కొండలరావు, ఉమాపతి, పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయంలో విరాళాలు అందజేత



పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పలు విరాళాలు అందజేశారు. ఆలయంలోని శ్రీఅంకమ్మ ఉపాలయం గోపురం వెండి తాపడం తయారీకి మల్లారెడ్డిగూడెం మండలం, దొండపాడు గ్రామానికి చెందిన కృష్ణయ్య, గురవమ్మ దంపతులు రూ.10 వేలు ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, పాలకవర్గ సభ్యులు కోలా రామారావు చేతుల మీదుగా అందజేశారు. నిత్యాన్నదాన పథకం, గోశాల సంరక్షణకు భక్తులు రూ.21,116 అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

వైభవంగా వెంకన్న చక్రతీర్థం



తిరుమలగిరి(జగ్గయ్యపేట): వాల్మీకోద్భవ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రతీర్థం కార్యక్రమాలను అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు, పరాంకుశం వాసుదేవాచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కొండ కిందనున్న కోనేరులో కల్యాణ ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి చక్రతీర్థం, వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం మహా నివేదన, ధ్వజారోహణం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ ఏసీ శ్రీరామవరప్రసాదరావు, చైర్మన్ సుబ్రహ్మణ్యం, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నైతిక విలువతో కూడిన విద్య అందించాలి



ఇబ్రహీంపట్నం: పాఠశాల స్థాయిలోనే క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని ఎంఈఓ సీహెచ్ పుష్పలత అన్నారు. స్థానిక మెరీడియన్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు కరస్పాండెంట్ పి.శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించారు. నైపుణ్యంతో కూడిన విద్య అందించి వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని ఎంఈఓ సూచించారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు.

కళావేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో హైదరాబాద్ మణికొండకు చెందిన శ్రీకళాకేంద్రానికి చెందిన పలువురు నృత్యకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై జక్కంపూడి కీర్తి, పెదిరెడ్ల లిఖిత, షాన్విత, వాసవిశ్రీ, అనగాశ్రీ, భవ్యలు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల అనంతరం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనను భక్తులు ఆసక్తిగా వీక్షించారు. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

చంద్ర వర్ధంతి

నందిగామ: కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతి కార్యక్రమం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బలుసు పాటి రాంబాబు, కట్టా చామంతి, మన్నే హనుమంతరావు, వేముల వీరయ్య, షేక్ మౌలాలి, జానీ లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

నందిగామ: ఈస్టర్‌ను క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రీస్తు సిలువ మరణం పొంది మూడో రోజున తిరిగి లేచిన సందర్భంగా జరుపుకునే పండగ ఈస్టర్. స్థానిక వేళంగిణి మాత చర్చిలో 10.30 గంటలకు దివ్య సత్ప్రసాద ఆరాధనతో ఈస్టర్ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువులు కమతం మరియదాసు, బాలస్వామి ప్రత్యేక దివ్య బలి పూజ సమర్పించారు. క్రీస్తు సమాధి నుంచి లేచి వచ్చే సన్నివేశాన్ని అర్ధరాత్రి సమయంలో ప్రత్యేకంగా ప్రదర్శించారు. మిగిలిన ప్రార్థనాలయాల్లో రాత్రి 11 నుంచి ఆరాధన కార్యక్రమాలు ప్రారంభమై తెల్లవారు జాము 5 గంటల వరకు కొనసాగాయి. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కూడా ఆరాధన కార్యక్రమాలు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



క్రీస్తు సమాధి నుంచి లేచి వస్తున్న సన్నివేశాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

చందర్లపాడు మండలంలో

మండలంలో ఈస్టర్ వేడుకలు ప్రతి గ్రామంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చందర్లపాడు తోపాటు మండలంలోని ప్రతి గ్రామంలో శనివారం రాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి.

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక సెయింట్ థామస్ సీఎస్ఐ టౌన్ చర్చిలో జరిగిన వేడుకల్లో డీనరీ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ డి.రాజు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డీసీ రాజు మాట్లాడుతూ అందరూ మరణించి మట్టిలో కలిసిపోతే, ఈయన మాత్రం మరణమనే సమాధి నుంచి గొప్పగా లేచి మృత్యువుపై విజయఢంగా మోగించి చరిత్రను చారిత్రకంగా రూపుదిద్దారన్నారు. కార్యక్రమంలో చర్చి కమిటీల ప్రతినిధులు ఎంపీ జోసఫ్, పాకలపాటి కనకరాజు, పి.ఇమ్మానుయేలు, ఎంపీ దేవరాజు, జె.కుమార్‌బాబు, జి.రాజరత్నం, జి.విజయలక్ష్మి, గ్రేస్ అమ్మవారు, స్త్రీల మైత్రి సభ్యులు, సండేస్కూల్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ స్వామినాథం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. వైవై కాలనీలోని కాలేజ్ ఆఫ్ బైబిల్ టెక్నాలజీ(క్రైస్ట్ చర్చి)లో పాస్టర్ ఎ.విజయరావు ఆధ్వర్యంలో, కోదాడ రోడ్డులోని బేతెస్థ ప్రార్థనా మందిరంలో, బలుసుపాడు రోడ్డులో బేతేలు చర్చిలో బిషప్ జాన్ బాబు, విలియంపేట జి.జి.ఎఫ్ మినిస్ట్రీ చర్చిలో ఎస్.జోసఫ్‌కిరణ్ ఆధ్వర్యంలో, క్రిస్టియన్‌పేట, విలియంపేట చర్చిల్లో డీసీలు గంధం రవి, సీహెచ్.జయరాజు, సెయింట్ ఆన్స్ చర్చిలో సిస్టర్స్ ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు.



నందిగామ ఆర్సీఎం చర్చిలో దివ్యబలిపూజ

కంచికచర్ల: స్థానిక ఆర్సీఎం చర్చిలో ఫాదర్ దేవదత్తు మాట్లాడుతూ, మాట్లాడుతూ మానవాళి పాపంతో క్రీస్తు సిలువ మరణం పొంది తిరిగి లేచాడన్నారు. మండలంలోని గండేపల్లిలో సీఎస్ఐ విశ్వాసులు కీసర మున్నేటిలో పాస్టర్ జాన్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో47మంది బాప్తిస్మము తీసుకున్నారు. అనంతరం ప్రేమ విందు చేశారు. పెద్దసంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

వీరులపాడు: మనుషుల పాపవిమోచనకే ప్రభువు ఏసుక్రీస్తు లోకానికి వచ్చారని నిత్య సహాయ మాత ఆలయ రెవ. ఫాదర్ ములుగుమాటి జోసఫ్ సుగుణరావు పేర్కొన్నారు. ఈస్టర్ పండుగ సందర్భంగా మండలంలోని జగన్నాథపురం గ్రామంలోని నిత్య సహాయ మాత ఆలయంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి విజయ్‌పాల్ రెడ్డి, సొసైటీ చైర్మన్ తమ్మా జ్ఞానారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

- బోడవాడ, జమ్మవరం విచారణ పరిధిలోని పరిశుద్ధ లూర్ధుమాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెవ. ఫాదర్ సాలే వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో దివ్యబలిపూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కర్ల స్వాతి, నాయకులు దాసు, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.
- పొన్నవరం గ్రామంలోని ఫెయిగ్ బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ గొర్రెపాటి రత్నం, ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామంలో సిలువ మార్గం కార్యక్రమాన్ని నిర్వహించారు.



జగన్నాథపురంలోని నిత్య సహాయమాత ఆలయంలో ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనల్లో విశ్వాసులు

కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలి

విజయవాడకల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు ప్రజా సేవలో భాగస్వాములు కావాలని కళాకారుల సంక్షేమం కోసం కార్యాచరణ చేసుకోవాలని ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ మహ్మద్ ఇంతియాజ్ తెలిపారు. మహానటి సావిత్రి సాహిత్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సినీ సంగీత విభావరి, ఎన్టీఆర్ శతజయంతి వేడుకల్లో భాగంగా సామాజిక సేవకుడు పిడికిటి భూపాల్‌కు సినీనటుడు ఎన్టీఆర్ సేవా తపస్వి పురస్కార కార్యక్రమాన్ని అందజేశారు. ఇంతియాజ్ మాట్లాడుతూ.. గుంటూరులో జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో భూపాల్‌తో పరిచయం ఏర్పడిందని వారు సమాజిక సేవలను ఆనాడే గుర్తించినట్లు తెలిపారు. కృష్ణా జిల్లా కలెక్టర్‌గా కోవిడ్ సమయంలో ప్రజలకు సేవ చేసే అవకాశం కలిగిందన్నారు. నగరంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయ సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాల్సిన అవసముందన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలి..

శాతవాహన కళాశాల కరస్పాండెట్ నిడుమోలు రమాసత్యనారాయణ మాట్లాడుతూ.. సావిత్రి కళాపీఠం స్థాపించి 13 సంవత్సరాలుగా వివిధ రంగాల్లోని ప్రముఖులను గుర్తించి వారికి సేవా పురస్కారాలను ప్రదానం చేస్తున్న కళాపీఠం సేవలను ఇంతియాజ్ అభినందించారు. ఎన్టీఆర్ పేరుతో జిల్లాను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి



భూపాల్‌కు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అభినందించారు సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ కలాం యువ ఫౌండేషన్ స్థాపించి నగరాన్ని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా చేయడానికి చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్న పిడికిటి భూపాల్‌ను 2022 సంవత్సరానికి గానూ ఎన్టీఆర్ సేవా తపస్వి పురస్కారం ప్రదానం చేశామన్నారు. పురస్కార గ్రహీత భూపాల్ మాట్లాడుతూ.. పర్యావరణానికి ప్రమాదంగా మారిన ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాల్సిన అవసముందన్నారు. తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి, బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి, చావా నరసింహారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో గాయకుడు బాలాజీకుమార్ ఆధ్వర్యంలో నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు చిత్ర గీతాలను ఆలపించారు.

నేడు స్పందన

నందిగామ: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీఓ రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు. ప్రజలు దీన్ని వినియోగించుకోవాలని కోరారు.

మత సామరస్యానికి ప్రతీక

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని మోతీ మస్జిద్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. మోతీ మస్జిద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఖాజా బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే వెలంపల్లి, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు గౌస్‌మొహిద్దీన్, హబీబుల్లా, మొహర్రాజ్, చిచ్చా బ్రదర్స్‌లతో పాటు మసీదు కమిటీ పెద్దలు పాల్గొన్నారు. అతిథులు ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొనడంతో పాటు ఇఫ్తార్ స్వీకరించారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ పెద్దలు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును సత్కరించారు. మసీదు ఆవరణలో షెడ్డు నిర్మాణానికి వెలంపల్లి ఫౌండేషన్ నుంచి నిధులు వెచ్చించి అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి, పిళ్లా సూరిబాబు(జగ్గు), ముస్లింలు పాల్గొన్నారు.

పటమట(విజయవాడతూర్పు): మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ అని పటమట సీఐ డి.కాశీవిశ్వనాథ్ అన్నారు. ఆదివారం జవహర్ ఆటోనగర్ ఏటీఏ రోడ్డులోని స్టార్ మసీదులో యునైటెడ్ ముస్లిం మైనారిటీ ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో సీఐ పాల్గొన్నారు. సీఐ మాట్లాడుతూ.. ఐకమత్యం మత సామరస్యానికి చిహ్నమని, కుల మతాలకు అతీతంగా స్నేహభావంతో మెలగడంతో పరిసర ప్రాంతాలు ఎటువంటి భేషజాలకు తావులేకుండా ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. పవిత్రమైన రంజాన్ మాసం దాన ధర్మలకు ప్రతీకని, ముస్లింలు నియమ నిబంధనలు పాటిస్తూ నిష్ఠగా ఈ మాసం మొత్తం రోజా ఉంటారని తెలిపారు. ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు అభినందనలు తెలిపారు. యూఎంఎంఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బెజవాడ నజీర్, అధ్యక్షుడు మొహమ్మద్ సుభాని, వక్త మౌలానా మొహమ్మద్ మాక్బుల్ సీఐ కాశీ విశ్వనాథ్, వెలగా జోషిలకు శాలువా కప్పి తెలుగు అనువాదం ఖురాన్‌ను బహుకరిచారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ అలీ, మొహమ్మద్ చాన్ బాషా, ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ అప్సర్, మొహమ్మద్ ఆషరావుల్లా, మొహమ్మద్ బషీర్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ‘చదవడం మాకిష్టం’

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులతో పాఠ్య పుస్తకాలతో పాటు నీతికథలు, మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను చదివించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ తెలిపారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, కథలు చెప్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు గ్రంథాలయంలో అందుబాటులో ఉండే నీతి కథలు, సాహిత్యం, మహనీయుల జీవిత చరిత్రలు, శాస్త్రవేత్తల జీవిత చరిత్రలు తదితర పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థుల చేత భగవద్గీత పఠనం చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, సునీత, సిబ్బంది జె.శంకర్, గోపాలరావు, ఫణిబాబు, దుర్గాంబ పాల్గొన్నారు.



చదవడం మాకిష్టం కార్యక్రమంలో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు

నేడు మారెమ్మవారికి పంబల సేవ

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి వార్షిక తిరునాళ్ల సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో గ్రామస్తులు, భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి వెంకట సత్య శేష సునీల్ కుమార్ తెలిపారు. అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ఆఖరి రోజు అమ్మవారికి పంబలసేవ, పుట్ట బంగారం తెచ్చుట కార్యక్రమాలు ఉంటాయని ఈఓ వై సీతారామయ్య పేర్కొన్నారు.

‘కేంద్రం చర్యలు దుర్మార్గం’

నందిగామ: కేంద్రం చర్యలు దుర్మార్గంగా ఉన్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మతోన్మాద బీజేపీని సాగనంపి దేశాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. నేతలు కటారపు గోపాల్, సయ్యద్ ఖాసిం, గోపి నాయక్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ రైతులకు సత్కారం

ఈలప్రోలు(ఇబ్రహీంపట్నం): ఈలప్రోలు గ్రామంలో ప్రకృతి ద్వారా సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులను కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి మాట్లాడుతూ పూర్వం సేంద్రియ వ్యవసాయంతో పండించిన పంటలు కుటుంబ ఆరోగ్యాన్ని పెంచేవన్నారు. ప్రస్తుతం పాశ్చాత్య పోకడలతో రసాయన ఎరువల వ్యవసాయం అలవాటు అయినప్పటికీ గ్రామంలో బత్తుల శ్రీనివాసరావు, కొండెపాటి పూర్ణచంద్రరావు సేంద్రీయ వ్యవసాయం చేయడం అభినందనీయమన్నారు.



ఈలప్రోలు గ్రామంలో రైతులను సత్కరిస్తున్న కిసాన్‌మోర్చా నాయకులు

జగనన్నతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు

జగ్గయ్యపేట అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచిందని, ఆయనతో రాష్ట్రానికి ఉజ్వల భవిత అని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో ఆదివారం జగనన్నే మా భవిష్యత్...మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా స్థానిక 11 వ సచివాలయం 23 వ వార్డు మంగలిబజారులో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఏఎంసీ డైరెక్టర్ షేక్ మస్తాన్ తదితరులు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన మేలు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని గమనించాలని కోరారు. 5 వ సచివాలయం పరిధిలోని దుర్గాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ పాల్గొన్నారు. 6 వ సచివాలయం 17 వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా, మైనార్టీ నాయకులు షేక్ రెహమాన్, రహంతుల్లా, అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



11వ సచివాలయం 23వ వార్డులో కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

కొళ్లికూళ్ల(పెనుగంచిప్రోలు): సీఎం జగన్ పాలనల్లో ప్రతి ఇంటా ఆనందం వెల్లువిరుస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. ‘జగనన్నే మా భవిష్యత్తు..మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమం మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పండుగలా నిర్వహించారు. కొళ్లికూళ్ల, అనిగండ్లపాడు గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ఇంటింటికి వెళ్లారు. కార్యక్రమంలో మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా శాంతి కల్యాణం

తాటిగుమ్మి(వీరులపాడు): తాటిగుమ్మి గ్రామంలోని అలివేలు మంగాపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి సుప్రభాత సేవ, బాలభోగం, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నిత్య హోమం, నవగ్రహ హోమం, చక్రస్నానం, పూర్ణాహుతి పూజలు చేశారు. అనంతరం శాంతి కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. సాయంత్రం పలు రకాల పుష్పాలు, విద్యుత్ దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బెజవాడ నారపరెడ్డి, ఆలయ చైర్మన్ కొండపురెడ్డి వెంకటరామిరెడ్డి, కరుణ, సర్పంచ్ పలకా మోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి, సుధాకర్ రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, దోర్నాల రవి, పలవురు నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పద్మశాలి సంఘానికి నూతన కార్యవర్గం

జగ్గయ్యపేట అర్బన్: పద్మశాలీ సంఘం స్థానిక నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీరంగనాయక స్వామి ఆలయం సమీపంలో సంఘ కార్యనిర్వాహకులు సంగెపు రాజశేఖర్, పొట్టాబత్తిన రాఘునాథ్, కుక్కడపు సురేష్ ఆధ్వర్యంలో, సీనియర్ సభ్యుడు మెటికల శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా పెనుమల్లి చంద్రమౌళి, భారత జగన్, కోశాధికారిగా చెరుపల్లి నాగరాజు, ఉపాధ్యక్షులుగా అల్లి రవిచంద్, గాలి శ్రీను, గుడ్ల శిరీష, గంజి కొండ, సహాయ కార్యదర్శులుగా కర్నాటి రాజేశ్వరి, గోసిక శ్రీనివాసరావు, మునిని హరికృష్ణ, యలగందుల రాంకిరణ్‌తో పాటు 21 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కమిటీకి గౌరవ అధ్యక్షులుగా యేళాల సీతారామమూర్తి, సంగెపు బుజ్జిబాబు, రచ్చా రామారావు, సంగెపు వెంకన్న, భారత లక్ష్మీనారాయణ, గౌరవ సలహాదారులుగా యలదండి శ్రీనివాసరావు, అల్లి కిషోర్, న్యాయవాది సామల వినీల, మెటికల శ్రీనివాసరావు, వి.రాంబాబులు ఉన్నారు.



ఎన్నికైన పద్మశాలీల సంఘం నూతన కార్యవర్గం

ముగిసిన సీతారాముల కల్యాణోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం డౌన్‌లో సీతారాముల కల్యాణోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన భారీ అన్నదానం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు సీతారాములను దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. నాలుగు వేల మంది భక్తులకు అన్నదానం జరిగింది. కార్యక్రమాలను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కంచర్ల రాము, ఎస్‌వీఆర్, సీహెచ్ నాని, వల్లభనేని సతీష్, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అజిత్‌సింగ్‌నగర్: శ్రీసీతారాముల వారి కల్యాణ వేడుకలను ఏటా అత్యంత వైభవంగా జరుపుకోవడం అభినందనీయమని, ఆ స్వామి వారి దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. సింగ్ నగర్ గంగానమ్మ గుడి వద్ద చేపట్టిన శ్రీరామనవమి వేడుకలు ముగింపు సందర్భంగా ఆదివారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ రుహుల్లా పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా సింగ్‌నగర్ ప్రాంతం నిలుస్తుందని, ప్రసిద్ధి గాంచిన గంగానమ్మగుడిలో ప్రతి ఏడాది శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించడం సంతోషదాయకమన్నారు. గంగానమ్మవారు, శ్రీసీతారాముల వారి కరుణ, కటాక్షం ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, షేక్ అమిత్, గంగానమ్మ గుడి కమిటీ పెద్దలు పిరాట్ల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉచిత వైద్య సేవలను వయోవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి తెలిపారు. స్థానిక దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వయోవృద్ధులకు ఉచిత ఆయుర్వేదం, అల్లోపతి, హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ప్రముఖ వైద్యులతో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆదిత్య చంద్రభొట్ల, హోమియో వైద్యనిపుణులు డాక్టర్ కోనా రామబ్రహ్మం, అయుర్వేద వైద్యనిపుణులు డా. ప్రసాద్ పాల్గొని ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించటంతో పాటు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 200 మంది వైద్యసేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమంలో ట్రస్టీ తట్టి అర్జునరావు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కోనా రామబ్రహ్మం